నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 8 జూలై 2024
MONDAY, JULY 8, 2024

## చుక్కాపూర్ లో భక్తుల సందడి

మాచారెడ్డి,జూలై 7 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.జిల్లా నలుమూలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## మాచారెడ్డి ఎస్సై బదిలీ!

మాచారెడ్డి,జూలై 7 : స్థానిక ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బదిలీ అయినట్లు సమాచారం ఇప్పటికే ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ అయినట్లు తెలిసింది. ఏఎస్సై యూసుఫ్‌కు ఇన్‌చార్జి ఎస్సైగా బాధ్యతలు అప్పగించారు. అధికారికంగా ఉత్తర్వులు వెలువడకున్నా ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేయడం చర్చనీయంగా మారింది. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు తెలిసింది.

## అక్కాపూర్‌లో కండ్ల అద్దాల పంపిణీ



కండ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు చైర్మన్

మాచారెడ్డి,జూలై 7 : మండలంలోని అక్కాపూర్ గ్రామంలో శ్రీలక్ష్మీనర్సింహా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముత్యాల నర్సింహారెడ్డి వంద మందికి ఆదివారం కండ్ల అద్దాలను పంపిణీ చేశారు. జూన్ 29న గ్రామంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వారిలో కండ్ల అద్దాలు అవసరం ఉన్న వంద మందికి ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నవీన్‌రెడ్డి, రాజిరెడ్డి, సన్నీ, పద్మారెడ్డి, గ్రామస్తులు బాల్‌చంద్రం, బాబు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం'

కామారెడ్డి, జూలై 7 : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదామని బీజేపీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాజీ ఎంపీ బీబీపాటిల్ పాల్గొన్నారు.ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కామారెడ్డిలో 19 వేల మెజార్టీ తెచ్చిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు పెద్దోళ్ల గంగారెడ్డి, నాయకులు నరేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కాసర్ల శ్రీనివాస్, ఆకుల భరత్, నరేందర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

భిక్కనూరు, జూలై 7: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఆదివారం చేపట్టిన ఎమ్మార్పీఎస్ ధర్నాకు భిక్కనూరు మండల నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోట్టిగిని శంకర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మార్పీస్ నాయకులు లక్ష్మణ్, రామస్వామి, సిద్దరాములు, బసవరాజు, సారయ్య, శ్రీనివాస్, రాజు, సంజీవ్ ఉన్నారు.



## ముమ్మరంగా వరినాట్లు

బాన్సువాడ నియోజకవర్గంలో వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బాన్సువాడ, బీ ర్కూర్, కోటగిరి, చందూర్, వర్ని తదితర మండలాల్లో కొన్ని చోట్ల ఇప్పటికే వరినాట్లు పూర్తి కాగా, బాన్సువాడతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల కింద వరి నాట్లు వేస్తున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు వరినాట్లు వేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఉదయం 5 గంటలకే పంట పొలాలకు చేరుకొని 7 గంటల నుంచి వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి 15 రోజులుపాటు నీటిని విడుదల చేయడంతో బాన్సువాడ నియోజక వర్గంలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు దూరమయ్యాయి.

–బాన్సువాడ, జూలై 7

## అభివృద్ధి పనులకు భూమిపూజ

బిచ్కుంద, జూలై 7: మండలంలోని కందర్‌పల్లి గ్రామ శివారులో ఉన్న సిద్దేశ్వర ఆలయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీడీఎఫ్‌తో ఆలయ ప్రాంగణంలో చేపట్టే కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగ్‌నాథ్‌పటేల్, నాయకులు సిద్ధప్ప పటేల్, సంజయ్ శెట్కార్, మాజీ ఎంపీటీసీ సురేశ్, పొడే మల్లికార్జున్, నౌషానాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న యోగా భవన్ సభ్యులు

కామారెడ్డి, జూలై 7 : వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా యోగా భవన్ ఆవరణలో ఆదివారం యోగా సభ్యులు వారి తల్లిదండ్రుల పేర ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటారు.ఈ సందర్భంగా యోగా గురువు రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. నేటి మొక్క రేపు చెట్టు అయి పర్యావరణాన్ని కాపాడుతుందని అన్నారు. కార్యక్రమంలో యోగా సభ్యులు రఘుకుమార్, అంజయ్య, సిద్దాగౌడ్, ప్రసాద్, రమేశ్, శ్రీనివాస్, గోపి, అనిల్ రెడ్డి, ఎల్లయ్య, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

కామారెడ్డి, జూలై 7 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఆంజనేయ స్వామి క్షేత్రం భూకాన్ పల్లిలో శ్రీ పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు గంగవరం ఆంజనేయ శర్మ, ఆలయ అర్చకుడు వెంకట్రావ్ జోషి, సతీశ్ పాండే,అజయ్ పాండే ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తగకమడ్ల ఆంజనేయులు, ఆరో వార్డు కౌన్సిలర్ ఆకుల రూపా రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

## గ్రూప్ -1 మెయిన్స్‌కు ఎంపికైన కోనాపూర్ జీపీ కార్యదర్శి



భరత్

బాన్సువాడ రూరల్, జూన్ 7 : బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న భరత్ గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో పాసై మెయిన్స్‌కు ఎంపికైయ్యాడు. జూన్ 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించగా, ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. మెయిన్స్‌కు ఎంపికైన భరత్‌ను గ్రామస్తులు అభినందించారు.

## 'వీడీసీలో ఎలాంటి అవకతవకలూ జరగలేదు'

భిక్కనూరు, జూలై 7: మండలంలోని జంగంపల్లి వీడీసీలో ఎలాంటి అక్రమాలూ జరగలేదని అధ్యక్షుడు పుల్లురి శివలింగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడీసీ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని, వీడీసీని రద్దు చేయాలని కోరుతూ స్థానిక నాయకులు శనివారం ఎంపీడీవోకు ఫిర్యాదుచేశారని, వారి ఆరోపణల్లో వాస్తవలేదని పేర్కొన్నారు. గ్రామంలో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్తులు, వివిధ సంఘాల డైరెక్టర్ల సమక్షంలో వీడీసీ ఆదాయ, వ్యయాల వివరాలకు సంబంధించిన లెక్కలను చూపించినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపిస్తున్నవారే బినామీ పేరుతో టెండర్లలో పాల్గొన్నారని, జమనాతుదారులుగా ఉంటూ వీడీసీకి బాకీ ఉన్నారని పేర్కొన్నారు. వీడీసీకి బాకీ సొమ్మును చెల్లించకుండా ఆరోపణలు చేస్తున్నారని, గతంలో వారు కూడా వీడీసీ డైరెక్టర్లుగా కొనసాగారని తెలిపారు. వారి ఆరోపణలను వీడీసీ తరపున ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా బీఎన్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 7: ఎల్లారెడ్డి పట్టణంలో భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం (బీఎన్‌ఆర్‌కేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, శ్రమశక్తి, మహామేస్త్రీ, అంబేద్కర్ పురస్కార్ అవార్డు గ్రహీత కామల్ల ఐలన్న జన్మదిన వేడుకలను ఆదివారం కార్మికులు ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని బీఎన్‌ఆర్‌కేఎస్ కార్యాలయంలో కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో బీఎన్‌ఆర్‌కేఎస్ ఎల్లారెడ్డి సంఘు సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



ఎల్లారెడ్డిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎల్లారెడ్డి/ రామారెడ్డి, జూలై 7: మాదిగల రిజర్వేషన్ల సాధన కోసం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ సబ్బండ కులాల కోసం పని చేస్తున్నదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు అన్నారు. ఎమ్మార్పీఎస్ ఏర్పాటై 30 ఏండ్లు అవుతున్న సందర్భంగా ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగల రిజర్వేషన్ల కోసం పుట్టిన సంస్థ.. అన్ని వర్గాల కోసం పని చేస్తున్నదని చెప్పారు. వికలాంగుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నదని, గుండె జబ్బుల పిల్లల కోసం పని చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు తిమోతి, భూమేశ్, రాజు బాబు, నవీన్, ప్రవీణ్, రామకిష్టయ్య, ఆశయ్య, రాజు, సంగయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయిలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కొత్తోళ్ల యాదగిరి జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కొత్తోళ్ల గంగారాం, సాయిలు, శంకర్, నర్సింహులు, సాయవ్వ, రాజమణి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతు చేయండి సారూ..!



అధ్వానంగా మారిన లొంకలపల్లి – లింగంపేట రోడ్డు

నాగిరెడ్డిపేట, జూలై 7: మండల కేంద్రంలో లొంకలపల్లి మీదుగా లింగంపేట వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రం నుంచి లొంకలపల్లి నుంచి శెట్పల్లి వరకు నాలుగు కిలోమీటర్లు కంకర రోడ్డు ఉండగా 2012లో బీటీగా మార్చారు. ప్రస్తుతం గుంతలు పడి కంకర తేలి ప్రమాదకరంగా మారి వాహనాదారులుతీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మీదుగా నిత్యం శెట్పల్లి సంగారెడ్డి, లింగంపేట, కామారెడ్డికి వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల ప్రజలు కోరుతున్నారు.

## కరుణించని వరుణుడు.. బోసిపోతున్న జలాశయాలు

- వర్షాల కోసం రైతన్న ఎదురుచూపులు
- తగ్గుతున్న భూగర్భ జలాలు
- బీళ్లుగా మారుతున్న పొలాలు



ఎడారిని తలపిస్తున్న లింగంపేట పెద్దవాగు



పూర్తిగా అడుగంటిన మెంగారం గ్రామ ఊర చెరువు

లింగంపేట, జూలై 7: వానకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా.. సరైన వర్షాలు కురవక పోవడంతో జలాశయాలు నీరు లేక వెలవెబోతున్నాయి. జూలై మాసం మొదలై వారం రోజులు గడిచినా ఇప్పటివరకు పెద్ద వర్షం కురవలేదు. సకాలంలో వర్షాలు కురిస్తే పచ్చని పంట పొలాలతో కళకళలాడాల్సిన భూములు బీళ్లుగా మారాయి. మండలంలోని 50కి పైగా చెరువులు, కుంటలు నీరు లేక బోసిపోయాయి. మండల రైతులు వర్షాధారంగా చెరువులపై ఆధారపడి పంటలు పండిస్తుంటారు. బోరుబావుల వద్ద కొద్ది మంది నాట్లు వేసినా.. ఎక్కువ శాతం భూములన్నీ బీళ్లుగానే ఉన్నాయి. కోటి ఆశలతో పంటల సాగుకు వానకాలంలో శ్రీకారం చుట్టిన రైతుకు.. వరుణుడు మొండి చేయి చూపాడు. దీంతో వానల కోసం రైతులు ఆకాశంవైపు దీనంగా చూస్తున్నారు. సీజన్ ప్రారంభంలో ఒకటి, రెండు వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. మండలంలోని కోమట్‌పల్లి, పోతాయిపల్లి, శెట్పల్లిసంగారెడ్డి, పోల్కంపేట, లింగంపేట, మోతె, ఎల్లారం, భవానీపేట, పర్మళ్ల తదితర గ్రామాల్లో పెద్ద చెరువులు ఉన్నాయి. వర్షం జాడ లేకపోవడంతో ఆ చెరువులన్నీ నీరు లేక ఎడారిని తలపిస్తున్నాయి. గత సంవత్సరం కురిసిన వర్షాలకు జూలై నెలలోనే పెద్దవాగులో నీటి ప్రవాహం కొనసాగింది. ఈ సంవత్సరం చుక్క నీరు లేక రాళ్లురప్పలతో ఎడారిని తలపిస్తున్నది.

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ అయిన పెద్దవాగులో చుక్క నీరు లేదు. మండలానికి ఎగువ భాగంలో ఉన్న గాంధారి మండలంలోనూ వర్షాలు కురియక పోవడంతో పెద్దవాగులో నీటి చుక్క లేదు. పెద్దవాగులో ప్రవహించే వరద సుమారు 20 గ్రామాల్లోని పంటల సాగుకు నీరు అందిస్తుంది. లింగంపేట ఊర చెరువుతోపాటు రెండు కుంటలకు నీరు వచ్చి చేరుతుంది. వరణుడు కరుణిస్తే తప్ప రైతులు పంటలు సాగు చేసే అవకాశం కనిపించడం లేదు. ఇకనైనా వానదేవుడు కరుణిస్తాడని రైతులు ఆశిస్తున్నారు.

## పల్లె ప్రకృతి వనంపై నిర్లక్ష్యం






అడవిని తలపిస్తున్న గోపాల్‌పేట పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతివనంలో ధ్వంసమైన సిమెంట్ బల్లాలు

- పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి
- విరిగినపోయిన బల్లాలు

నాగిరెడ్డిపేట, జూలై 7: మండల కేంద్రం గోపాల్‌పేట పల్లె ప్రకృతి వనంపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. గోపాల్‌పేట ఉన్నత పాఠశాల స్థలంలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. పచ్చని చెట్లు పెంచి, వనం చుట్టూ నడిచేందుకు దారిని ఏర్పాటుచేశారు. దారికి ఇరువైపులా ఇటుకలతో అందంగా తీర్చిదిద్దారు. ప్రజలు సేద తీరేందుకు బల్లాలు ఏర్పాటు చేయడంతోపాటు నీటి వసతిని కూడా కల్పించారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుర్తు తెలియని దుండగులు బల్లాలను ధ్వంసం చేశారు. వనంలో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. అధికారులు స్పందించి వనంలోని పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.




## నేడు గోపాల్‌పేట తైబజార్ వేలం

నాగిరెడ్డిపేట, జూలై 7: మండల కేంద్రంలోని గోపాల్‌పేట పంచాయతీ కార్యాలయంలో సోమవారం తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. సరైన ధర రాకపోవడంతో ఇప్పటికే రెండు పర్యాయాలు వేలం వాయిదా వేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి ఉన్న వ్యాపారులు పాల్గొనాలని సూచించారు.

## తాజా మాజీ జడ్పీటీసీకి సన్మానం

నాగిరెడ్డిపేట, జూన్ 7: తాజా మాజీ జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డిని మండలంలోని ఆత్మకూర్ గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఐదేళ్లలో మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావడానికి ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు వసంత్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, సుదర్శన్, మల్లారెడ్డి, ప్రతాప్ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నర్సరీల నిర్వహణ అధ్వానం



నర్సరీలోని ప్యాకెట్లలో మొలకెత్తని విత్తనాలు

- మొలకెత్తని విత్తనాలు
- పెరిగిన గడ్డి

డోంగ్లీ, జూలై 7: రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చాలనే ఉద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటుచేసి వాటిలో మొక్కలను పెంచి వానకాలంలో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలను నాటించారు. వాటి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అప్పట్లో నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి ప్రజలకు ఆహ్లాదాన్ని, చక్కటి వాతావరణాన్ని పంచుతున్నాయి. పల్లె ప్రజలకు స్వచ్ఛమైన ప్రాణ వాయువును అందిస్తున్నాయి. కానీ ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో నర్సరీల నిర్వహణ అధ్వానంగా మారింది.

మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో విత్తనాలు మొలకెత్తలేదు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. సిర్పూర్ గ్రామ నర్సరీలో ఖాళీ బ్యాగులే దర్శనమిస్తున్నాయి. నర్సరీలో గడ్డి పెరిగిందని, అయినా పట్టించుకునే వారే లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేస్తే వన మహోత్సవంలో మొక్కలను ఎలా నాటుతారని ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుపై వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.




సిర్పూర్‌లోని హరితహారం నర్సరీ